AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
9-2-2026 (Monday)
MAIN EDITION

## ఢిల్లీలో పలు పాఠశాలలకు బాంబు బెదిరింపులు



**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** దేశ రాజధాని ఢిల్లీలోని పలు పాఠశాలలకు సోమవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో అధికారులు అప్రమత్తమై తనిఖీలు చేపట్టారు. పాఠశాలలకు బాంబు బెదిరింపు కాల్స్ రావడంతో సోమవారం ఉదయం ఉన్నత స్థాయి భద్రతా హెచ్చరికలు జారీ చేశారు. పోలీసులు, అత్యవసర సంస్థలు వెంటనే చర్యలు తీసుకున్నాయి. ఢిల్లీలోని తొమ్మిది ప్రముఖ పాఠశాలలకు బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయి. పాఠశాలలకు బెదిరింపులు అందిన వెంటనే, యాజమాన్యం అధికారులను అప్రమత్తం చేసింది. ఢిల్లీ పోలీసులు.. విద్యార్థులు, సిబ్బందిని పాఠశాలల నుంచి పంపి తనిఖీలు చేశారు.

## లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాసం పెట్టనున్న విపక్షాలు!




**అక్షరటుడే, ఢిల్లీ:** లోక్‌సభలో విపక్ష సభ్యుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. దీంతో సోమవారం ఉదయం స్పీకర్ ఓం బిర్లా సభను వాయిదా వేశారు. అయితే ఆయనపై ప్రతిపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం పెట్టాలని యోచిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో రాహుల్ గాంధీని సభలో మాట్లాడడానికి అనుమతించలేదని ప్రతి పక్షాలు ఆరోపిస్తున్నాయి. స్పీకర్ తీరుపై విపక్షాలు ఆందోళన చేస్తున్నాయి. ఈ క్రమంలోనే అవిశ్వాసం పెట్టే యోచనలో ఉన్నట్లు సమాచారం.

## నరసింహుడికి రూ.15లక్షల కానుకలు



**అక్షరటుడే, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారికి ఓ భక్తుడు రూ.15లక్షల విలువైన కానుకలు అందజేశాడు. రాగిపై బంగారు తాపడంతో చేసిన హనుమంత, మకర తోరణం, గజ వాహనాలు, రెండు శఠారీలను స్వామివారికి సమర్పించారు. సూర్యాపేటకు చెందిన అశోక్ అనే భక్తుడు ఆలయ ఈవో భవాని శంకర్‌కు అందజేశారు.

## ఆ వ్యాఖ్యలపై చట్టపరం ముందుకు..



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** తమ కుటుంబానికి పాకిస్థానీ ఏజెంట్ అలీ తౌఖీర్ షేక్‌తో సంబంధాలు ఉన్నాయని అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ చేసిన వ్యాఖ్యలపై లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగొయ్ స్పందించారు. ఆయన మాట్లాడిన వీడియో ఆధారంగా కేసు నమోదు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

## కుప్పకూలిన చార్టర్డ్ ఫ్లయిట్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కర్ణాటక రాష్ట్రంలోని విజయపుర జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం ఓ ప్రైవేట్ శిక్షణ విమానం ప్రమాదానికి గురైంది. బాబలేశ్వర్ తాలూకాలోని మంగళూరు సమీపంలో ఉన్న ఒక బహిరంగ ప్రదేశంలో ఈ విమానం కూలిపోయింది. అది 'రెడ్‌బర్డ్ ఫ్లయింగ్ ట్రైనింగ్ అకాడమీ'కి చెందిన సెన్నా 172 రకం విమానంగా గుర్తించారు.



# పురపోరులో గెలుపే లక్ష్యం

**మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఆయన సోమవారం ఉదయం మంత్రులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ నేతలు సమన్వయంతో ముందుకు వెళ్లి మెజారిటీ మున్సిపల్ పీఠాలను కైవసం చేసుకోవాలని సీఎం సూచించారు.**

**– అక్షరటుడే, హైదరాబాద్**

- ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చేలా చూడాలి
- జూబ్లీహిల్స్ ఫలితాలు రిపీట్ కావాలి
- సీఎం రేవంత్‌రెడ్డి
- జూమ్ మీటింగ్‌లో మంత్రులకు దిశానిర్దేశం

మున్సిపల్ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం 5 గంటలతో ముగియనుండడంతో అభ్యర్థులు 48 గంటలు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితిగతులపై వివరాలు తెలుసుకున్నారు. బలహీనంగా ఉన్న మున్సిపాలిటీల్లో ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రతి ఓటరూ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇవాళ, రేపు నేతలు ఓటర్లకు అందుబాటులో ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రతికూల పరిస్థితి ఉన్నచోట అప్రమత్తంగా ఉండాలన్నారు.

### అందుబాటులో ఉండాలి

పీసీసీ పరిశీలకులు, ఎన్నికల ఇన్‌ఛార్జీలు, కో-ఆర్డినేటర్లు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఎక్కడ పొరపాట్లు జరకుండా చూడాలన్నారు. ఏదైనా సమస్య వస్తే పీసీసీ పరిశీలకుల దృష్టికి తీసుకు వెళ్లాలని ఆదేశించారు. వెంటనే సమస్యలను పరిష్కరించుకొని గెలుపు కోసం శ్రమించాలన్నారు. గాంధీ భవన్‌లో వార్ రూం సైతం ఏర్పాటు చేశామన్నారు. జూబ్లీహిల్స్ ఫలితాలు మున్సిపల్ ఎన్నికల్లో రిపీట్ కావాలన్నారు.

### సర్వేలు అనుకూలం

రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగనున్నాయి. అన్ని సర్వేలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉత్తర తెలంగాణలోని కీలకమైన నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ పలువురు రెబల్‌గా పోటీ చేస్తున్నారు. వారితో ఓట్లు చీలితే కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోయే అవకాశం ఉందని సీఎం అన్నారు.

## బర్డ్ ఫ్లూ కలకలం.. 28 వేల కోళ్లు మృతి




**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ బర్డ్ ఫ్లూ కలకలం రేపింది. అన్నమయ్య జిల్లా పరిధిలోని సదుం మండలంలో ఈ వైరస్ వ్యాపించడంతో దాదాపు 28 వేల కోళ్లు మృతి చెందాయి. ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్ ఫ్లూ వ్యాపిస్తుండడంతో కోళ్ల ఫాంల యజమానులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సదుం మండలంలోని పుట్టవాండ్లపల్లె, కంభంవారిపల్లె, అమ్మగారిపల్లె గ్రామాల్లోని కోళ్ల ఫారాల్లో కొన్ని రోజులుగా కోళ్లు చనిపోతున్నాయి. దీంతో ఫాంల నిర్వాహకులు అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఆయా పౌల్ట్రీ ఫాంలను పరిశీలించారు. దాదాపు 28 వేల కోళ్లు మృతి చెందినట్లు గుర్తించారు. కోళ్ల నమూనాలను మధ్యప్రదేశ్‌లోని భోపాల్ గల హై సెక్యూరిటీ యానిమల్ డిసీజ్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌కు పంపించారు. అక్కడ పరీక్షలు చేసిన అనంతరం కోళ్లు బర్డ్ ఫ్లూతో చనిపోయినట్లు నిర్ధారణ అయింది.

## సింగరేణిని రక్షించేది బీజేపీయే..: కిషన్‌రెడ్డి

**అక్షరటుడే, గోదావరిఖని:** సింగరేణి అప్పుల ఊబిలో విలవిలాడుతోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గోదావరిఖనిలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణకు అన్యాయం చేశాయన్నారు. రామగుండం ప్రాంత అభివృద్ధి కోసం గత ప్రభుత్వం చేసిందేమీ లేదని వ్యాఖ్యానించారు. ఇక్కడ ఎరువుల కర్మాగారం, పవర్ ప్రాజెక్టు తెచ్చింది బీజేపీనే అని గుర్తు చేశారు. సింగరేణిని రక్షించుకోకపోతే మూతపడే ప్రమాదముందన్నారు. తెలంగాణలో కారు పంక్చర్ అయిందన్నాని.. ఆ పార్టీలో ఉన్న నాయకులు తలో దారి చూసుకున్నారన్నారు. బీఆర్ఎస్‌లో జరిగిన అవినీతిపై కేసీఆర్ కుమార్తె కవిత కూడా చెబుతున్నారని పేర్కొన్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదన్నారు. సింగరేణిని రక్షించేది బీజేపీ మాత్రమేనని కిషన్ రెడ్డి అన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి మెదక్ రావడానికి భయపడ్డారు: హరీశ్‌రావు



**అక్షరటుడే, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెదక్ జిల్లాకు రావడానికి భయపడ్డారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆయనకు జిల్లాకు వచ్చే ముఖం లేదన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం పలు జిల్లాల్లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆయన మెదక్ జిల్లాలో ప్రచారానికి రాలేదు. మెదక్‌లో తాను ఉండడంతో సీఎం రావడానికి భయపడ్డారని హరీశ్‌రావు అన్నారు. సోమవారం ఆయన దుబ్బాకలో ప్రచారం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ హామీలు అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, గ్యారెంటీలు గారడీలపై మెదక్ ప్రజలు నిలదీస్తారని సీఎం ఇటు వైపు చూడడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రచారానికి రావాలని కోరినా సీఎం రాలేదన్నారు. జిల్లాలో గెలిచే పరిస్థితి లేదని, వస్తే తన పరువు పోతుందని ప్రచారానికి సీఎం రాలేదని ఎద్దేవా చేశారు.

## అబద్ధాల సీఎంకు బుద్ధి చెప్పాలి: కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్:** అబద్ధపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆరు గ్యారెంటీల గురించి ప్రశ్నిస్తే, బూతులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. భూపాలపల్లిలో సోమవారం కేటీఆర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. యాసంగి సీజన్ సగం పూర్తయినా.. రైతు బంధు ఇవ్వలేదన్నారు. ఈ అబద్ధాల, బూతుల ముఖ్యమంత్రికి బుద్ధి చెప్పాలంటే పోలింగ్ బూత్‌కు వెళ్లి 'కారు' గుర్తుకే ఓటు వేయాలని కోరారు. 11వ తేదిన కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టకపోతే మళ్లీ మోసం చేస్తారని చెప్పారు. సింగరేణి కాంట్రాక్టుల పేరుతో రేవంత్ రెడ్డి రూ.6 వేల కోట్ల దోపిడీ చేశారని ఆరోపించారు. 'సైట్ విజిట్' నిబంధన పెట్టి టెండర్లను అడ్డుకుని, తన బావమరిదికి కాంట్రాక్టులు కట్టబెడుతున్నారన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాను ఏర్పాటు చేసి, కేసీఆర్ అభివృద్ధి చేశారని చెప్పారు.

## నార్సింగిలో హైడ్రా కూల్చివేతలు

**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. ప్రభుత్వ స్థలాలు, పార్కులు, నాలాలను కబ్జా చెరల నుంచి విడిపిస్తోంది. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని అరుణోదయ హౌసింగ్ సొసైటీకి చెందిన సుమారు 1600 గజాల పార్కు స్థలాన్ని కొందరు కబ్జా చేశారు. దీంతో స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. అనంతరం పార్కు కబ్జాకు గురైనట్లు నిర్ధారించుకొని సోమవారం ఉదయం కూల్చివేతలు చేపట్టారు. సుమారు రూ.50 నుంచి 80 కోట్ల విలువైన పార్కు స్థలంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసి స్థలాన్ని ఆధీనంలోకి తీసుకున్నారు. కబ్జాలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని, భవిష్యత్తులో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హైడ్రా అధికారులు హెచ్చరించారు.

## ప్రపంచానికి మనమే కంప్యూటర్లు అందిస్తాం: సీఎం చంద్రబాబు



**అక్షరటుడే, ఏపీ:** అమరావతి కేంద్రంగా క్వాంటం కంప్యూటింగ్‌కు శంకుస్థాపన చేశామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతిలో మంత్రులు, కార్యదర్శుల సోమవారం సమావేశం నిర్వహించారు. ఏపీలో క్వాంటం కంప్యూటింగ్‌కు ఆదివారం చంద్రబాబు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా ఆయన మాట్లాడారు. త్వరలో ప్రపంచానికి మనమే కంప్యూటర్లు అందిస్తామన్నారు. ఏఐ, క్వాంటం కంప్యూటర్లు, డేటా సెంటర్లతో పెనుమార్పులు రానున్నట్లు చెప్పారు. ప్రతినెలా అధికారులు సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, ఇన్‌ఛార్జి మంత్రులు పని చేయాలన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు క్షేత్రస్థాయిలో పని చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. చిన్న సమస్యలను సైతం సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

## బ్రేకప్‌పై మానస వారణాసి వ్యాఖ్యలు వైరల్..



**మిస్ ఇండియాగా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న మానస వారణాసి ఇప్పుడు వెండితెరపై కొత్త జర్నీకి రెడీ అవుతోంది. సంతోష్ శోభన్ & మానస జోడిగా నటించిన చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ' రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ అమ్మడు చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. తన కాలేజీ రోజుల్లో ఎదురైన తొలి ప్రేమ అనుభవాన్ని గుర్తుచేసుకున్న మానస, ఆ వయసులో ఉండే అమాయకత్వమే ఆ బంధాన్ని ప్రత్యేకంగా మార్చిందని చెప్పింది. ప్రేమ అనేది కేవలం భావోద్వేగం మాత్రమే కాదు, మనల్ని మనం అర్థం చేసుకునే ప్రయాణం అని చెబుతూ, అలాగే బ్రేక్ అప్‌ను విషాదంగా కాకుండా, జీవితానికి దశ చూపించే ఒక పాఠంగా చూడాలని ఆమె సూచించారు. ఆ సమయంలో మనకు మన విలువలు, ఆశలు స్పష్టంగా తెలుస్తాయని చెప్పారు.**

**- అక్షరటుడే, సినిమా డెస్క్**

## ఇటలీపై స్కాట్లాండ్ ఘన విజయం

**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా నేడు ఇటలీ వర్సెస్ స్కాట్లాండ్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో స్కాట్లాండ్ 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేపట్టిన స్కాట్లాండ్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. ఓపెనర్ జార్జ్ మున్సే (84; 54 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో మెరిశాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో మైకేల్ లీస్క్ (22*; 5 బంతుల్లో) వరుసగా 4, 2, 4, 6, 6 బాదేయడంతో స్కోరు 200 దాటింది. ఇటలీ బౌలర్లలో అలీ హసన్, గ్రాంట్ స్టీవర్ట్, థామస్ డ్రాకా, స్మట్స్ తలో వికెట్ సాధించారు. 208 పరుగుల లక్ష్యఛేదనకు బరిలో దిగిన ఇటలీ.. 16.4 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. 12 ఓవర్లకు 113/3తో ఉన్న ఆ జట్టు.. వరుసగా వికెట్లు కోల్పోయి కుప్పకూలింది. 21 పరుగుల వ్యవధిలో చివరి ఆరు వికెట్లను కోల్పోయింది.